క్లుప్తంగా

శిథిల భవనంలో విధులు



పొన్నూరు: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరింది. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా మారినా పట్టించుకోవడం లేదు. భవనం పైభాగంలో విరిగిన చెక్కలు, పెంకులు దర్శనమిస్తున్నాయి. పెచ్చులూడి ముక్కలు కింద పడుతున్నాయి. దీంతో సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఏ సమయంలో పెచ్చులూడి తమపై పడతాయో తెలియని పరిస్థితి నెలకొందని సిబ్బంది వాపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిన ప్రజలు ఈ కార్యాలయాలన్ని చూసి విస్తు పోతున్నారు. కార్యాలయానికి రావాలంటే ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి భవనానికి కనీస మరమ్మతులైనా చేపట్టాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

పశువుల వ్యర్థాలను ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించాలి



ప్రత్తిపాడు: పాడి రైతులు పశువుల వ్యర్థాలను ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించాలని, అక్కడ కంపోస్టు ఎరువును తయారు చేస్తారని డీఎల్‌పీవో కె. శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలను ఎంపీడీవో కె.శివ పార్వతితో కలిసి ఆయన పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేస్తున్న విధానాన్ని పరిశీలించి, పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి పాడి రైతులతో మాట్లాడారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై ఆరా తీశారు. మహిళలతో మాట్లాడారు. వెంట ఈవోపీఆర్డీ ఆదం షఫీ, సెక్రటరీ ఖాజా తదితరులున్నారు.

రేషన్ పంపిణీలో సమయపాలన పాటించాలి



పొన్నూరు: ఈనెల 30వ తేదీ వరకు 65 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ డీలర్లను ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు విధిగా సమయపాలన పాటిస్తూ కార్డు దారులందరికీ రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఈకేవైసీ చేయించుకోని కార్డు దారులకు ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. రేషన్ షాపుల వద్ద విధిగా స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కార్డు దారుల నుంచి ఫిర్యాదులు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, సీఎస్ డీటీ మాదిరాజు వెంకట్రావు, ఆర్ఐ మొగదాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేకరించిన చెత్త ఎస్‌డబ్ల్యూపీసీకి



ప్రత్తిపాడు: ఎట్టకేలకు గ్రామంలో సేకరించిన చెత్త ఎస్‌డబ్ల్యూపీసీకి చేరుతుంది. ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించకుండా గ్రామ శివారుల్లో పడేస్తూ, అక్కడే నిప్పు పెడుతున్నారని, ఊరంతా చెత్త కుప్పలే దర్శమిస్తున్నాయంటూ ఈ నెల 26వ తేదీన 'సాక్షి'లో 'సేకరించిన చెత్తంతా రోడ్డుపాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి జీవీఆర్‌కే మూర్తి శుక్రవారం ఉదయం ఆరు గంటలకే గ్రామానికి చేరుకుని గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్తను దగ్గరుండి రిక్షాల్లో ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించారు. అక్కడే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు పిట్లులో వేయించారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ పరిధి బేతపూడి, మునగపాడు గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలలో శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పొగాకు వాడటం వల్ల కలిగే దుష్ఫలితాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ కె.సుదర్శనరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో అలుముకున్న చీకట్లు!

- పలు వీధుల్లో వెలగని వీధి దీపాలు
- రాత్రిళ్లు అంధకారంలో వీధులు
- అవస్థలు ఎదుర్కొంటున్న ప్రజలు



మెయిన్ రోడ్డు వెంబడి ఓ వీధిలో అలముకున్న అంధకారం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో చీకట్లు అలుముకున్నాయి. రాత్రిళ్లు పలు వీధుల్లో వీధి దీపాలు వెలగడం లేదు. గత కొద్ది రోజులుగా ఇదే సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నా.. అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రాత్రిళ్లు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ ప్రత్తిపాడులో సుమారు నాలుగు వేలకు పైగా కుటుంబాలు ఉన్నాయి. 14 వేల మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామంలో సుమారుగా 3,200 వరకూ విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి. వాటిలో అనేక స్తంభాలకు ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. పంచాయతీ పాలక వర్గ సమావేశాల్లో పాలకవర్గ సభ్యులు సైతం సమస్యను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నా ఫలితం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డు (మెయిన్ రోడ్‌లో) సైతం అక్కడక్కడా లైట్లు వెలగడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కాంట్రాక్టు ముగియడంతో..

గతంలో ప్రత్తిపాడు పంచాయతీకి విద్యుత్ పరికరాలు, వీధి దీపాలు, పీహెచ్ సామాగ్రి, పీడబ్ల్యూఎస్ సామాగ్రి, స్టేషనరీ సరఫరా చేసేందుకు దక్కించుకున్న టెండరు సమయం ముగిసింది. దీంతో ఇటీవల పంచాయతీ అధికారులు 2025–26 సంవత్సరానికి సంబంధించి కొత్త టెండర్లుకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఆ తర్వాత జరిగిన పంచాయతీ సాధారణ సమావేశంలో టెండర్ల అంశం వాయిదా పడింది. దీంతో విద్యుత్ పరికరాలు గానీ వీధి దీపాలు గానీ కొనుగోలు చేసుకోలేని పరిస్థితి చోటుచేసుకుంది. అత్యవసర సమయాల్లో వినియోగించుకునేందుకు సెక్రటరీలు తమ చేతి డబ్బులతోనో, అప్పులు చేసో వీధి దీపాలు కొనుగోలు చేసి సమస్యను తాత్కాలికంగా నెట్టుకొస్తున్నారు. అయినా సమస్య తప్పడంలేదు.



మెయిన్ రోడ్డులో వెలగని విద్యుత్ దీపాలు

వీధుల్లో అంధకారం..

ప్రత్తిపాడు శివారు ప్రాంతాలతో పాటు అనేక వీధుల్లో రాత్రి పూట అంధకారం అలుముకుంటుంది. వీధి దీపాలు వెలగక జనం నిశీధుల్లో మగ్గుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడం వానలు కురుస్తుండటంతో పొలాలు, పొదల్లో ఉండే విష సర్పాలు, పురుగుల సంచారం అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎక్కడ సర్పాల బారిన పడాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి షేక్ ఖాజాను 'సాక్షి' వివరణ కోరగా వీధి దీపాలు వెలగని విషయం మా దృష్టికి కూడా వచ్చిందని అన్నారు. 150 వరకూ వీధి దీపాలు కొనుగోలు చేశామని.. మరమ్మతులు చేసి స్తంభాలకు దీపాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

వైఎస్సార్ సీపీ విజయమే అందరి లక్ష్యం



పొన్నూరు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులతో అంబటి మురళీకృష్ణ

- పదవులను బాధ్యతగా నిర్వర్తించాలి
- సూపర్ సిక్స్ అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు గ్రామంలో శుక్రవారం గ్రామ వైఎస్సార్ సీపీ నూతన కమిటీ ఎంపిక, పొన్నూరు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముడియాల మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. పార్టీని పునఃనిర్మాణం చేసి విజయం సాధించడానికి నూతన కమిటీలు దోహదపడతాయన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చిత్తశుద్ధితో నెరవేర్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, గ్రామ సర్పంచి పిట్లు శివకృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆకుల వెంకటేశ్వర రావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరూ కలిసి ఎన్నుకున్నవారే నాయకులు..

పొన్నూరు నియోజవర్గంలో కమిటీల ఎంపిక, అనుబంధ విభాగాల అధ్యక్షుల ఎంపిక అంతా పార్టీ శ్రేణులకే అప్పగించారు. అందరూ కలిసి ఎన్నుకున్నవారినే అధ్యక్షులుగా ఎంపిక చేశామని అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఇటీవల పార్టీ ప్రకటించిన పొన్నూరు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. పొన్నూరు నియోజకవర్గం యూత్ వింగ్ అధ్యక్షుడిగా చుండూరు వీరయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలుగా భీమవరపు విజయలక్ష్మి, రైతు విభాగం అధ్యక్షుడిగా పాకనాటి సుధాకర్, బీసీ సెల్ అధ్యక్షుడిగా కూరాకుల ముక్తేశ్వరరావు, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ కిరణ్, ఎస్టీసెల్ అధ్యక్షునిగా బాపట్ల నాగప్రసాద్, క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షునిగా బాణాల విజయ్‌కుమార్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షునిగా కానుగోలు గోపి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షునిగా అన్నదాసు సుబ్బారావు, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షునిగా మేడిక పద్మాకర్, వాలంటీర్ వింగ్ అధ్యక్షునిగా బచ్చు అప్పిరెడ్డి నియమితులయ్యారు. అలానే గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షునిగా శివాబత్తును దయానంద్, వీవర్‌వింగ్ అధ్యక్షునిగా రవిరాల వెంకట్రావు, అంగన్వాడీ వింగ్ అధ్యక్షునిగా కట్టేవరపు ఆశాజ్యోతి, కల్చరల్ వింగ్ అధ్యక్షునిగా ఉప్పుమాగులూరు శివరామకృష్ణ, ఐటీవింగ్ అధ్యక్షునిగా సుంకర నాగవర్ధన్‌రెడ్డి, ఇంటలెక్చువల్ అధ్యక్షునిగా నల్లమోతు రవీంద్రబాబు, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షునిగా చాగంటి మురళీకృష్ణరెడ్డి, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షునిగా బద్దులూరి భాస్కర్ రెడ్డిలు నియమితులయ్యారు. పదవులను అలంకారంగా కాకుండా బాధ్యతగా భావించి పార్టీ విజయానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షులు పేర్కొన్నారు.



అగతవరప్పాడు సమావేశంలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

అగతవరప్పాడు గ్రామ కమిటీ ఎంపిక..

అగతవరప్పాడు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఆట్ల సుబ్బారెడ్డి, కుంచల నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కుంచల అంజిరెడ్డి, రుద్రపోగు గాబ్రేల్, వేముల శంకర్, నీలం సతీష్‌కుమార్, కార్యదర్శులు పిట్టు దుర్గారెడ్డి, ఆట్ల రాజశేఖరరెడ్డి, షేక్ అబ్దుల్ భాషా, డేరంగుల కొండలు నియమితులయ్యారు. అలానే యూత్ అధ్యక్షునిగా గద్దె జగదీష్, రైతు విభాగం పిట్లు రుద్రారెడ్డి, మహిళా విభాగం పళని కోటేశ్వరిలు నియమితులయ్యారు.

● జానెడు పొట్టకోసం జీవన పోరాటం!



జీవన సమరంలో కొందరు బాలలు సమిధలుగా మారుతుంటారు. వారి బంగారు బాల్యం జీవన మజిలీలో బంధీగా మారిపోతుంది. తల్లిదండ్రులతో పాటు వారు కూడా బతుకు పోరాటం చేస్తుంటారు. వయసుతో సంబంధం లేకుండా ప్రాణాలను ఫణంగా పెట్టి కుటుంబ పోషణలో తామూ చేదోడుగా నిలుస్తుంటారు. అలాంటి చిత్రమే ఇది. తాడుపై మోకాళ్లతో నడేస్తూ కేవలం ఒక చేతితో మాత్రమే కర్రను బాలెన్స్ చేస్తూ చూపరులకు సెల్యూట్ చేసే ఈ బాలుడి పోరాటం జానెడు పొట్ట కోసమే. ఎక్కడి నుండో వచ్చిన ఈ వలస కుటుంబం ప్రత్తిపాడులో మూడు రోజులుగా ప్రధాన కూడళ్లలో ఇలా విన్యాసాలు చేస్తూ, డప్పు వాయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. విన్యాసాలు చూసి అబ్బురపడిన వారు వారికి తోచినంత సాయం చేస్తున్నారు. – ప్రత్తిపాడు

నేడు, రేపు ఆల్ ఇండియా చెస్ టోర్నమెంట్



ప్రత్తిపాడు: గుంటూరు రూరల్ మండలం లాంలోని చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ సహకారంతో ఈనెల 28, 29 తేదీల్లో ఆల్ ఇండియా అండర్–19 చెస్.. ఓపెన్ చెస్ టోర్నమెంట్–2025 పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. టోర్నమెంటుకు సంబంధించిన వాల్ పోస్టర్లను శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం.గోపీనాథ్‌తో కలిసి శుక్రవారం స్థానిక కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామారావు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరగనున్న పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందిస్తామని అన్నారు. ఆసక్తి ఉన్న వారు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. టోర్నమెంట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు 97030 49378 నంబరును సంప్రదించాలని చెప్పారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు: తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. ప్రత్తిపాడులోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం తల్లిదండ్రులు, విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, నీళ్ల విరేచనాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు నీళ్ల విరేచనాలు అయితే వెంటనే స్థానిక వైద్యాధికారులను సంప్రదించాలని చెప్పారు. అదే విధంగా ప్రస్తుతం వర్షాకాలం మొదలైన నేపథ్యంలో జలుబు, దగ్గు, జ్వరాల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వనజ, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలకు శ్రద్ధ వహించాలి

వేజండ్ల(చేబ్రోలు): చెత్త నుంచి సంపద తయారు చేసే నిర్వహణ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి వి.జ్యోతిబసు అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో శుక్రవారం చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ఘన వ్యర్థాల సేకరణ గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలు, సిబ్బందికి సూచనలు చేస్తున్న జ్యోతిబసు

ఇంటర్మీడియట్ అధికారికి వినతిపత్రం అందజేత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఇంటర్మీడియ్ ప్రాంతీయ కార్యాలయం అధికారికి పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్ మాట్లాడుతూ.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు ధనార్జనే ధ్యేయంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం దుస్తుల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారని.. ఒక బ్రాంచ్‌కు పర్మిషన్ తీసుకుని అనేక బ్రాంచ్‌లలో క్లాసులు నిర్వహిస్తున్నారని అన్నారు. పైఅంశాలను వివరిస్తూ ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి(ఆర్ఐఓ)కు వినతిపత్రం అందజేశామని, సానుకూలంగా స్పందించిన అధికారి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయి మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రోడ్డుపై నిలిచిపోతున్న మురుగు



పొన్నూరు: పట్టణంలోని 8వ వార్డు క్యాబిన్ పేట వీధిలో మురుగు పారుదల లేక రోడ్డుపైకి చేరుతోంది. దీంతో దుర్వాసన వస్తోందని.. దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు సమస్యపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వీధిలో రాకపోకలు సాగించాలంటే వాహన చోదకులతో పాటు పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

● అస్తవ్యస్తంగా డ్రైయిన్ నిర్మాణం!



పొన్నూరు పట్టణంలో చేపడుతున్న డ్రెయిన్ నిర్మాణాల్లో నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు. పట్టణ ప్రధాన రహదారిలో రూ.లక్షల వ్యయంతో చేపట్టిన మెయిన్ డ్రెయిన్ నిర్మాణం అస్తవ్యస్తంగా ఉన్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పట్టణాభివృద్ధిలో భాగంగా కసుకర్రు రోడ్డు మలుపు నుంచి కూరగాలయ మార్కెట్ వరకు డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. నిబంధనల ప్రకారం కొలతలతో నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా అవేమీ పట్టనట్లు ఇష్టారీతిన డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. మలుపులతో కూడిన కాలువ ఒకచోట ఎక్కువ.. మరోచోట తక్కువ స్థలంతో ఉండడంతో మురుగు, వ్యర్థాలు పారే పరిస్థితి కనిపించడం లేదు. భారీ వర్షాలు కురిస్తే డ్రెయిన్ పొంగి మురుగు రోడ్డుపైకి చేరుతోంది. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు. – పొన్నూరు

ముగిసిన అంతరాష్ట్ర ఏపీసీఐఎస్‌సీఈ క్రికెట్ టోర్నమెంట్

ప్రత్తిపాడు: గుంటూరు రూరల్ మండలం నల్లపాడులోని లొయోలా పబ్లిక్ స్కూల్లో వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. జోనల్ స్థాయిలో అండర్–14, అండర్–17 విభాగాల్లో ఆఖరి రోజు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. అండర్–14 విభాగంలో నల్లపాడు లొయోలా పబ్లిక్ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. ఎమ్మెస్ రెఫరల్ హాస్పటల్ స్కూల్(చిత్తూరు), స్టెమ్ స్కూల్(గుంటూరు) జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. అండర్–17 విభాగంలో ఎమ్మెస్ రెఫరల్ హాస్పటల్(చిత్తూరు) జట్టు విజేతగా నిలువగా.. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(కడప), శ్రీవేద స్కూల్(చిత్తూరు) వరుస స్థానాలను కై వసం చేసుకున్నాయి. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో పాఠశాల కరెస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డా. పి.ఆంటోనీ, ప్రిన్సిపాల్ రెవ.ఫా.డా.సగాయ రాజ్ మార్క్, వైస్ ప్రిన్సిపాల్ రెవ.ఫా.నరేష్ విజేతలకు ట్రోఫీలు అందించి క్రీడాకారులను అభినందించారు.



విజేతగా నిలిచిన టీంతో నిర్వాహకులు

యాజమాన్యం నష్ట పరిహారం చెల్లించాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 206వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన దుర్గారావు, స్టీవెన్‌లు మాట్లాడుతూ.. కార్మికులకు నష్టపరిహారం చెల్లించకుండా ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ చేసి వెళ్లిన యాజమాన్యం అడ్రస్ లేకుండా పోయిందని అన్నారు. ప్రస్తుతం ఏసీసీ ఫ్యాక్టరీ భూమి ఒక్కటే పరిహారానికి ఆధారంగా ఉందన్నారు. పరిహారం చెల్లించేంత వరకూ కార్మికులు దీక్షలు కొనసాగిస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుభాని, ఇస్మాయిల్, సాంబశివరావు, సూర్యప్రకాశరావు, గురవయ్య, కార్మికులు ఇమాంబీ, రమాదేవి, సారమ్మ, శివకుమారి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో కార్మికులు, నాయకులు

చలో తెనాలి కరపత్రాలు పంపిణీ

తాడేపల్లి రూరల్: శనివారం(నేడు) నిర్వహించనున్న చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేక అమరారెడ్డినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. న్యాయస్థానాలు ఎన్నిమార్లు చెప్పినా పోలీసుల తీరు మారడం లేదని అన్నారు. దళిత యువకులు తప్పుచేశారని తెలిస్తే చట్టం ముందు నిలబెట్టాలి గానీ.. నడిరోడ్డుపై లాఠీలకు పనిచెప్పకూడదని అన్నారు. ఈ దుశ్చర్యను ఖండించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, కె.బాబూరావు, బర్నబాస్, దుర్గారావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌టీ సొసైటీ అధ్యక్షులుగా డాక్టర్ రవికుమార్

తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఎన్ఆర్‌టీ సొసైటీ అధ్యక్షులుగా డాక్టర్ వేమూరి రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సహకారంతో తెలుగు వారిని ప్రపంచంలో నెంబర్ వన్‌గా నిలబెట్టడమే తన లక్ష్యమని అన్నారు. ఎన్ఆర్ఐల భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తానని, రాష్ట్రంలో చదువుకున్న యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలకు ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీ ఎన్ఆర్‌టీసీ చైర్మన్ బి.శేషారావు, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఎడ్యుకేషన ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్, ఏపీఎన్‌టీసీ ఎండీ గణేష్‌కుమార్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.